సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం । 23 । డిసెంబర్ । 2024



చలికాలం.. వ్యాధుల గాలం

వాతావరణంలో మార్పులతో చీకటి పడగానే విపరీతమైన చలితో జనాలు వణుకుతున్నారు. వ్యాధులు కూడా ప్రబలుతున్నాయి.

8లో



టమాట కిలో రూ.23

అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.23 పలికింది. కనిష్టం రూ.10, సరాసరి రూ.16 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.8°/16.4°

జిల్లా అంతటా చలి వాతావరణం కొనసాగుతోంది. ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటలకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు ఎస్పీ ఆఫీసులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వి.రత్న ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అర్జీదారులు తమ ఆధార్‌కార్డును తప్పని సరిగా వెంట తీసుకొని రావాలన్నారు. ప్రజలు తమ సమస్యలపై నేరుగా ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పెన్నహోబిలంలో లడ్డూ ప్రసాదం కరువు



లక్ష్మీనరసింహస్వామి ఆలయం

ఉరవకొండ: ప్రముఖ క్షేత్రమైన పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులకు ఇచ్చే లడ్డూ ప్రసాదం కరువైంది. ఆరు నెలలుగా ప్రసాదం ఇవ్వకపోవడంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భక్తులు పవిత్రంగా భావించే లడ్డూ ప్రసాదం అందించేందుకు దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారులు ఇంత వరకూ టెండర్లు పిలవలేదు. ఇదిలా ఉండగా భక్తుల రద్దీ సమయంలో లడ్డూ ప్రసాదం ఇవ్వకపోతే బాగుండదని కొందరు సిబ్బంది సహకారంతో బయటి దుకాణాల్లోంచి తీసుకొచ్చిన లడ్డూలను విక్రయించారు. అయితే లడ్డూ తయారీలో నాణ్యత లోపించిందని, అధిక ధర వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు రావడంతో అధికారులు బయటి లడ్డూలకూ మంగళం పాడేశారు. భక్తులు చేసేది లేక స్వామి దర్శనానంతరం తీర్థంతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది.

విశా ఫెర్రర్‌కు ఉమెన్ అచీవ్‌మెంట్ అవార్డు



అవార్డు అందుకుంటున్న విశా ఫెర్రర్

అనంతపురం: ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశా ఫెర్రర్‌ను 'సౌత్ ఇండియన్ ఉమెన్ అచీవ్‌మెంట్ అవార్డు–2024' వరించింది. ఆర్డీటీ తరఫున మహిళా సాధికారతకు విశేషంగా కృషి చేసినందుకు గాను ఆమె ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఆదివారం బెంగళూరులోని కేఈఏ ప్రభాత్ ఆడిటోరియంలో సౌత్ ఇండియన్ ఉమెన్ అచీవ్‌మెంట్ అవార్డు (ఎస్‌ఐడబ్ల్యూఏ) సంస్థ సీఈఓ రాధ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

జిల్లా నుంచి 'సంక్రాంతి' బస్సులు



పుట్టపర్తి టౌన్: జిల్లాలోని ఆరు డిపోల పరిధి నుంచి సుదూర ప్రాంతాల్లో స్థిరపడిన జిల్లా వాసుల సౌకర్యార్థం సంక్రాంతికి 140 ప్రత్యేక బస్సు సర్వీసులను నడపనున్నట్లు ఆర్టీసీ ఆర్‌ఎం మధుసూదన్ తెలిపారు. ఈ మేరకు బస్సుల నిర్వహణపై సిబ్బందితో ఆదివారం ఆయన సమీక్షించారు. హైదరాబాదు, బెంగళూరు, తిరుపతి, విజయవాడ , చెన్నై తదితర ప్రాంతాల్లో స్థిరపడిన వారు సంక్రాంతి పండుగను సొంతూర్లలో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో వీరు సాధారణ చార్జీలతోనే రాకపోకలు సాగించేలా ప్రత్యేక సర్వీసులను కేటాయించారు. రిజర్వేషన్ చేయించుకునే వారికి పది శాతం రాయితీని అందజేస్తున్నారు. జనవరి 9 నుంచి 12వ తేదీ వరకు హైదరాబాదు నుంచి 30, బెంగళూరు నుంచి 24, తిరుపతి నుంచి 10, విజయవాడ నుంచి 15, చెన్నై నుంచి 10 బస్సులతో పాటు లోకల్ రూట్లలో 51 సర్వీసులను నడపనున్నారు. ఇవే బస్సులు తిరిగి 16 నుంచి 19వ తేదీ వరకు ఆయా నగరాలకు బయలుదేరి వెళ్లేలా కార్యాచరణను రూపొందించారు.



లయ తప్పుతోంది

- అనంతపురం రూరల్ పరిధిలోని సిండికేట్‌నగర్‌కు చెందిన భాస్కర్‌రాజుకు 32 ఏళ్లు. ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ నెల 8వ తేదీన ఉదయం ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే మృతి చెందాడు. కారణమేమని డాక్టర్లను అడిగితే 'గుండెపోటు' అని చెప్పారు.

- బత్తలపల్లికి చెందిన ఉషారాణిదీ ఇదే పరిస్థితి. ఈమె వయసు 38 ఏళ్లు. ఎంబీఏ పూర్తిచేసిన ఈమె హైదరాబాద్‌లో పనిచేస్తోంది. ఉన్నఫళంగా ఛాతీలో నొప్పిరావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఇంటెన్సివ్ కేర్‌లో అరగంట ఉన్నారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. గుండెపోటుతో చనిపోయింది.

- చిన్న వయసు నుంచే గుండెపోటు లక్షణాలు
- కొంప ముంచుతున్న ఆహారపు అలవాట్లు
- మద్యం, పొగతాగే వారిపై తీవ్ర ప్రభావం
- వ్యాయామం లేని వారికి డేంజర్ బెల్స్
- ఏడాదికి సగటున 20 వేల మందిలో లక్షణాలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: గుండె లయ తప్పుతోంది. ఎప్పుడు ఎలాంటి ఉపద్రవం వస్తుందో ఊహించలేని పరిస్థితి. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నామనుకునే యువతనూ భయపెడుతోంది. దూకుడు మీదున్న ఈ గుండెజబ్బుల నియంత్రణ అంతుచిక్కడం లేదు. గతంలో 50 ఏళ్లు దాటితే గానీ గుండెజబ్బులు వచ్చేవి కావు. పరిస్థితులు తల్లకిందులయ్యాయి. ఇంటర్మీడియెట్ చదువుతున్న 17 ఏళ్ల కుర్రాడు కూడా గుండెపోటుతో కుప్పకూలిపోవడం వైద్యులకే అంతుచిక్కడం లేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏటా 20 వేల మంది గుండెజబ్బుల బారిన పడుతున్నట్లు తేలింది.

దురలవాట్లే దుఃఖానికి కారణం..

నిండా 30 ఏళ్లు దాటని సాఫ్ట్‌వేర్ ఉద్యోగి గుండెపోటుతో మృతిచెందడం బాధాకరం. కానీ అతని అలవాట్లే కొంపముంచాయి. 80 శాతం మంది యువతీ యువకుల్లో గుండెపోటు రావడానికి సరైన ఆహార నియమాలు లేకపోవడం, వ్యాయామం అసలే లేకపోవడం కారణమని తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలో ఏటా సగటున 20 వేల మందికి పైగా గుండెపోటు అనుభవవాలను చవిచూస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా మొత్తం జబ్బులకయ్యే వ్యయంలో 30 శాతం గుండె జబ్బులకే అవుతుండటాన్ని బట్టి చూస్తే వీటి తీవ్రత ఎలా ఉందో అంచనా వేయొచ్చు.



ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆరోగ్యశ్రీ కింద గుండెజబ్బుల చికిత్స వివరాలు		
సంవత్సరం	గుండె చికిత్సలు	వెచ్చించిన వ్యయం
2019-20	4,660	రూ.20.07 కోట్లు
2020-21	5,107	రూ.21.42 కోట్లు
2021-22	6,637	రూ.27.71 కోట్లు
2022-23	7,909	రూ.32.97 కోట్లు
2023-24	10,274	రూ.44.14 కోట్లు
2024 డిసెంబర్ 20 దాకా	7,530	రూ.34.45 కోట్లు
మొత్తం	రూ.180.76 కోట్లు	

వ్యాయామం నిల్..

రోజువారీ వ్యాయామం లేకపోవడం అత్యంత ప్రమాదకరంగా ఉంది. 80 శాతం మందికి వ్యాయామంపై అవగాహన లేదని వెల్లడైంది. దినసరి కేలరీలు ఖర్చు కావాలంటే కచ్చితంగా నడక ఉండాలనే అవగాహన అతికొద్ది మందిలో మాత్రమే ఉంది. మరోవైపు మితాహారం, పౌష్టికాహారం తినడంలోనూ సమతూకం లేదు. దీంతో పాటు మద్యం, సిగరెట్లు తాగే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. వీటివల్ల గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వారానికి 150 నిమిషాలు కనీస నడక మంచిదని వైద్యులు చెబుతున్నారు. మధుమేహం, రక్తపోటు ఉన్న వారికి నడక అత్యంత అవసరమని వైద్యులు పదే పదే సూచిస్తున్నారు.

కొలెస్ట్రాల్ ప్రమాదం చాలామందికి తెలియదు

శరీరంలో రెండు రకాల కొవ్వులుంటాయి. ఒకటి హెచ్‌డీఎల్ (హై డెన్సిటీ లిపోప్రొటీన్స్), రెండోది ఎల్‌డీఎల్ (లో డెన్సిటి లిపోప్రొటీన్స్). ఈ రెండింటిలో హెచ్‌డీఎల్ మంచి కొలెస్ట్రాల్ కాగా, ఎల్‌డీఎల్ అత్యంత ప్రమాదకరం. 40 ఏళ్ల వయసు దాటాక కనీసం ఆరుమాసాలకు ఒకసారైనా షుగర్, బీపీ, కొలెస్ట్రాల్ టెస్టులు చేయించుకొని మందులు వాడితే గుండెపోటు నియంత్రించుకోవచ్చు.

నియంత్రణ సాధ్యమే



గుండె జబ్బుల నియంత్రణ అసాధ్యమేమీ కాదు. బీపీ, షుగర్ లాంటి దీర్ఘకాలిక జబ్బులను నియంత్రణలో ఉంచుకోవాలి. నడవడం, మెట్లెక్కడం వంటి శారీరక శ్రమ అవసరం. రోజూ 20 నిమిషాల ధ్యానం మంచిదే. రాత్రి కనీసం 8 గంటల నిద్ర ఉండాలి. ప్రొటీన్లతో కూడిన చిక్కుళ్లు, బఠానీ, చేపలు, బాదం, పిస్తా వంటివి తినడం మంచిది. ఊరగాయలు, చిప్స్ వంటి వాటికి దూరంగా ఉండటం , తగినంత నీరు తీసుకోవడం చేస్తే గుండెను పదిలంగా కాపాడుకోవచ్చు.

– డా.పి.సుధాకర్‌రెడ్డి,
గుండె జబ్బుల నిపుణులు

మెడికల్ షాపుల తనిఖీ

- ఓ షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు



మెడికల్ షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

హిందూపురం: 'డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా ఇష్టానుసారం మందులను విక్రయించడం నేరం. మత్తుకు సంబంధించిన మందుల విక్రయాలను గుర్తిస్తే మెడికల్ షాపుల లైసెన్సులు రద్దు చేయించడానికి సిఫార్సు చేస్తాం' అని డీఎస్పీ కేవీ మహేష్ అన్నారు. ఎస్పీ వి.రత్న ఆదేశాల మేరకు.. హిందూపురం పట్టణంలోని పలు మెడికల్ షాపులను డీఎస్పీతో పాటు ఇన్‌స్పెక్టర్లు రాజగోపాల్‌నాయుడు, కరీమ్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హనుమయ్య ఆదివారం తనిఖీ చేశారు. హిందూపురం ప్రభుత్వాస్పత్రి ఎదురుగా ఉన్న మెడికల్ షాప్‌లో తనిఖీ నిర్వహించారు. మెడికల్ స్టోర్ యజమానులు బిల్లులు లేకుండానే మందులు అమ్ముతున్నట్లు గుర్తించారు. అలాగే అనుమతిలేని ఔషధాలను వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయిస్తున్నట్లు తేల్చారు. 1940 డ్రగ్స్ , కాస్మోటిక్స్ చట్టానికి విరుద్ధంగా అమ్మకాలు నిర్వహిస్తున్నారని అధికారులు తెలిపారు. కొందరు ఈ ఔషధాలను మత్తు కోసం మద్యం బదులు ఉపయోగిస్తున్నట్లు గుర్తించామని డీఎస్పీ పేర్కొన్నారు. మెడికల్ షాపులకు అనుమతి పత్రాలు లేకుండా విక్రయాలు చేపట్టినా, మత్తుకు సంబంధించిన ఏ మందులు విక్రయించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతి లేని మందులు విక్రయిస్తున్న మెడికల్ స్టోర్ యజమానిపై డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో కేసు నమోదు చేశామని డీఎస్పీ మహేష్ తెలిపారు.

జవాబు పత్రాలు దగ్ధం

ఓడీచెరువు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఉపాధ్యాయుల గది తాళం పగలగొట్టి బీరువాలోని విద్యార్థుల జవాబు పత్రాలకు దుండగులు నిప్పు పెట్టారు. ఈ ఘటనలో కొన్ని జవాబు పత్రాలు కాలిపోయాయి. విషయం తెలిసిన వెంటనే ఎస్పీ రత్న.. డీఎస్పీ విజయ్‌కుమార్, స్థానిక మల్లికార్జునరెడ్డితో కలసి ఆదివారం ఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. సంఘటనకు సంబంధించి పాఠశాల హెచ్‌ఎంతో వివరాలు ఆరా తీశారు. వెంటనే ఈ కేసు దర్యాప్తును ముమ్మరం చేయాలని ఎస్పీ రత్న సిబ్బందిని ఆదేశించారు. ఇలాంటి దుశ్చర్యకు పాల్పడిన వారు ఎవరైనా సరే వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు.




ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రత్న

అల్లుకున్న నిర్లక్ష్యం



కోటగోడకు అల్లుకుపోయిన తీగలు




శిథిలావస్థలో తిమ్మరుసు సమాధి

- నిద్రావస్థలో పురావస్తుశాఖ అధికారులు

పెనుకొండ: రాచరిక వైభవానికి నిలయం పెనుకొండ. పురాతన ఎన్నో కట్టడాలు, దేవాలయాలు, కోటగోడ, ఖిల్లా, పసరక్కరి, పాలక్కరి బావులు, ప్రపంచంలోనే ప్రఖ్యాతి గాంచిన గగన్‌మహల్ ఇక్కడ ఉన్నాయి. అయితే పురావస్తుశాఖ ఈ కట్టడాల అభివృద్ధికి ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. కోటగోడలు, దేవాలయాలు, ఇతర కట్టడాలు శిథిలావస్థకు చేరుతున్నా వారు నిద్రావస్థను వీడటం లేదు. నాటి రాచరికపు వైభవాన్ని, రాజుల ఘనతను గుర్తుకు తెచ్చుకుంటున్నామే తప్ప నాటి కట్టడాలను పరిరక్షించడం, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంలో పురావస్తుశాఖ అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారు. కోటగోడలు, దేవాలయాలు, ఇతర కట్టడాలు దయనీయస్థితిలో కొట్టు మిట్టాడుతున్నాయి. భావి తరాలకు రాచరికపు వైభవం తెలుసుకునే అవకాశం లేకుండా పోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడటంతో ప్రస్తుతం కోట గోడను తీగ చెట్లు అల్లుకుపోయాయి. కొన్ని నేడో రేపో కూలే పరిస్థితికి చేరాయి. ఇప్పటికైనా పురావస్తుశాఖ అధికారులు నిద్రమత్తును వీడి నాటి రాచరికపు ఆనవాళ్లను కాపాడాలని పర్యాటక ప్రియులు, పట్టణ వాసులు కోరుతున్నారు.

వాహనదారులకు బాదుడే!



- లైసెన్స్ లేకపోతే రూ.5 వేలు
- హెల్మెట్ వాడకపోతే రూ.వెయ్యి జరిమానా
- జనవరి 1 నుంచి కఠినంగా అమలు చేస్తామంటున్న ఆర్టీఓ


హిందూపురం అర్బన్: వాహన యజమానులు ఇక జాగ్రత్త పడాల్సిందే. ఎందుకంటే రహదారి నిబంధనలు కఠినంగా అమలు చేసేందుకు రవాణా, పోలీసు అధికారులు సిద్ధమయ్యారు. 'హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం వల్లే ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయి. నిబంధనలను సరిగ్గా అమలు చేయడం లేదు' అంటూ పోలీస్, రవాణాశాఖ అధికారులపై ఇటీవల హైకోర్టు ధర్మాసనం అక్షింతలు వేసింది. ఇక.. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ఈ ఏడాది జూన్ నుంచే నూతన రహదారి భద్రతా నియమాలు అమల్లోకి వచ్చాయి. అయితే వాటిని అంత పక్కాగా అమలు చేయలేదు. అయితే రోజురోజుకూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నియంత్రణ, హైకోర్టు ఆదేశాల అమలులో భాగంగా అధికారులు నిబంధనలను కఠినతరం చేసేందుకు రెడీ అయ్యారు.

మైనర్లు వాహనం నడిపితే రూ.25 వేలు

గతంలో మైనర్లు వాహనాలు వాడితే పెద్ద వారికి శిక్ష పడేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. కొత్త చట్టం ప్రకారం మైనర్లు వాహనం నడిపితే రూ.25 వేలు జరిమానా విధిస్తారు.అలాగే మూడేళ్ల జైలు శిక్ష కూడా పడే అవకాశం ఉంది.

నిబంధనల ప్రకారం ఫైన్లు ఇలా..

- లైసెన్స్ లేకుండా డ్రైవ్ చేస్తే గతంలో రూ.500 జరిమానా విధించే వారు. ఇప్పుడు దాన్ని రూ.5000కు పెంచనున్నారు.
- రెడ్‌లైట్‌ను ఉల్లంఘించి వాహనాలను నడిపితే రూ.500 ఫైన్ వేస్తారు.
- అతివేగంగా వాహనాన్ని నడిపితే రూ.1000 వసూలు చేస్తారు.
- రాంగ్‌రూట్‌లో వాహనాన్ని నడిపితే రూ.5000 ఫైన్ విధిస్తారు.
- డ్రంక్ అండ్ డ్రైవ్ (మద్యం తాగి వాహనం నడిపితే) గతంలో రూ.2 వేలుగా ఉన్న ఫైన్‌ను ఇప్పుడు ఏకంగా రూ.10 వేలకు పెంచారు.
- రేసింగ్, స్పీడ్ డ్రైవ్ చేస్తే రూ.5 వేలు వసూలు చేయనున్నారు.
- హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనం, సీట్ బెల్టు ధరించకుండా కార్లు నడిపితే రూ.వెయ్యి కట్టాల్సిందే. దీనికి తోడు మూడు నెలలు లైసెన్స్ రద్దు చేస్తారు.
- అత్యవసర వాహనాలకు దారి ఇవ్వకుండా వెళితే రూ.10 వేల పైన ఫైన్ విధించనున్నారు.
- ద్విచక్ర వాహనాల్లో ట్రిబుల్ రైడింగ్ చేస్తూ పట్టుబడితే రూ.2 వేల వరకు చలాన్లు రాస్తారు.
- ఇన్సూరెన్స్ లేకుండా వాహనాన్ని నడిపితే రూ.2 వేలు ఇచ్చుకోవాల్సిందే.



నిబంధనలు పాటించాలి



జనవరి 1వ తేదీ నుంచి ట్రాఫిక్ నిబంధనలను పక్కాగా అమలు చేస్తాం . ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. రోడ్డు నిబంధనలు పాటించక పోవడం, వచ్చీరాని డ్రైవింగ్‌తో రోడ్లపైకి రావడం, మైనర్లు వాహనాలు నడపడం వల్లే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారులపై ద్విచక్ర వాహనదారులు అతి జాగ్రత్త పాటించాలి. మలుపులు, సర్కిళ్ల వద్ద నిర్లక్ష్యం నిండు ప్రాణాలను బలితీసుకుంటోంది. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారి తల్లిదండ్రులకు జైలు శిక్ష తప్పదు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని వాహనాలు నడపాలి.

– కరుణసాగర్‌రెడ్డి,
జిల్లా రవాణాశాఖ అధికారి, హిందూపురం

ప్రశాంతి నిలయంలో క్రిస్మస్ వేడుకలు



సాయి కుల్వంత్ మందిరంలో సంగీత కచేరీ



వేడుకలకు హాజరైన భక్తులు

పుట్టపర్తి అర్బన్: ప్రశాంతి నిలయంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దేశ విదేశాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున విచ్చేయగా ఆదివారం సాయంత్రం వేద పఠనంతో కార్యక్రమాలను మొదలు పెట్టారు. ఈ సందర్భంగా సాయికుల్వంత్ మందిరంలోని సత్యసాయి మహా సమాధిని ప్రత్యేకంగా అలంకరించారు. క్రిస్మస్ ట్రీ, స్టార్స్, విద్యుత్ వెలుగులతో సాయికుల్వంత్ మందిరం మెరిసిపోతోంది. ఆస్ట్రియాకు చెందిన ప్రముఖ గాయని అనాలూవ్ నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను మంత్రముగ్ధులను చేసింది. ప్రముఖ సంగీత కళాకారులు డాక్టర్ తానియా గోల్డ్‌బర్గ్ వయోలిన్, స్టాన్‌స్లైడేజ్ పియానో, సాయిజిత్ తబల బృందం సహకారం అందించారు. పలువురు భక్తులు క్రిస్మస్ గ్రీటింగ్ కార్డులను మహా సమాధిపై ఉంచి సత్యసాయికి సమర్పించారు. అనంతరం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ సంగీత కళాకారులను ఘనంగా సత్కరించారు.

ప్రశాంతి నిలయంలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ ట్రీ



క్లుప్తంగా

వీరభద్రుని సేవలో పట్నాయక్



ఆలయాన్ని సందర్శించిన ఆర్‌పీ పట్నాయక్, కుటుంబసభ్యులు

లేపాక్షి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన లేపాక్షి వీరభద్ర స్వామిని ఆదివారం సాయంత్రం కుటుంబసభ్యులతో కలసి సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ విశేషాలను వివరించారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు



తండ్రి వద్దకు చేరిన బాలుడు

కదిరి టౌన్: తప్పిపోయిన బాలుడి ఆచూకీని పోలీసులు పసిగట్టి సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. వివరాలు.. కదిరిలోని ఎస్‌జీఓ కాలనీలో నివాసముంటున్న ఏపీజీబీ రీజనల్ మేనేజర్ రమేష్‌కు పదేళ్ల వయసున్న కుమారుడు ఉన్నాడు. ఆదివారం ఇంటి బయట ఆడుకుంటూ ఆ బాలుడు కనిపించకుండా పోయాడు. మతి స్థిమితం సరిగా లేని కుమారుడు కనిపించకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురై చుట్టుపక్కల గాలిస్తూనే మరో వైపు పోలీసులకూ ఫిర్యాదు చేశారు. స్పందించిన సీఐ వి.నారాయణరెడ్డి ప్రత్యేక బృందాలను రంగంలో దింపి అడపాలవీధిలోని మున్సిపల్ స్కూల్ సమీపంలో ఉన్న కోహినూర్ గఫూర్‌ఖాన్ బావి వద్ద తచ్చాడుతున్న బాలుడిని గుర్తించి వెంటనే స్టేషన్‌కు పిలుచుకెళ్లారు. బాలుడి కుటుంబసభ్యులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ అనంతరం అప్పగించారు.

జాతి వైరం మరచి



కుక్క పిల్లలకు పాలిస్తున్న వరాహం

రాయదుర్గం టౌన్: సహజంగా పందులు కనిపిస్తే కుక్కలు వెంటబడి తరుముతాయి. కుక్క పిల్లలు కనిపిస్తే పందులు కసితీరా గాయపరిచి చంపేస్తాయి. అలాంటిది జాతి వైరాన్ని మరిచి కుక్క పిల్లలకు పాలు ఇచ్చి మాతృత్వాన్ని చాటుకుంది ఓ వరాహం. ఈ అరుదైన ఘటన రాయదుర్గం లోని కోట ఏరియాలో శంకర మఠం వెనుక ఆదివారం వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన మేరకు... ఆ ప్రాంతానికి చెందిన ఓ వీధి కుక్క ఐదు పిల్లలకు జన్మనిచ్చి చనిపోయింది. దీంతో కొందరు కుక్క పిల్లలను తీసుకెళ్లి శంకరమఠం వెనుక నిర్జన ప్రదేశంలో వదిలేశారు. ఆకలితో అలమటిస్తున్న కుక్క పిల్లలను గమనించిన ఓ పంది తన స్తన్యం అందించి పాలు ఇచ్చింది. ఈ వింతను స్థానికులు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు.

చలికాలం.. వ్యాధుల గాలం

పుట్టపర్తిలోని ఎనుములపల్లికి చెందిన 39 ఏళ్ల వ్యక్తి పది రోజులుగా జ్వరం, దగ్గు, జలుబు, గొంతునొప్పితో బాధపడుతున్నాడు. పుట్టపర్తిలోని జనరల్ ఆస్పత్రి, కొత్తచెరువులోని పీహెచ్‌సీలో చికిత్స చేయించుకుని మందులు వాడినా తగ్గలేదు. దీంతో వైద్యుల సూచన మేరకు ప్రైవేటు ల్యాబ్‌కు వెళ్లి రక్తపరీక్షలు చేయించుకున్నాడు. వైరల్ ఫీవర్ అని తేలింది. నాలుగు రోజుల పాటు సెలైన్ బాటిల్ ఎక్కించుకుంటూ సేదతీరుతున్నాడు. సుమారు పది రోజుల పాటు ఆస్పత్రుల చుట్టూ తిరిగినట్లు రోగి వివరించాడు.

హిందూపురంలో 30 ఏళ్ల వ్యక్తి నాలుగు రోజుల క్రితం కడుపు నొప్పితో జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చేరాడు. ఆ తర్వాత జలుబు, దగ్గుతో పాటు జ్వరం కూడా సోకినట్లు గుర్తించారు. ఈ క్రమంలోనే వైద్యులు అనుమానంతో ప్రైవేటు ల్యాబ్‌లో అల్ట్రా స్కాన్ చేయిస్తే కిడ్నీలో రాళ్లు ఉన్నట్లు నిర్ధారణ అయింది. రాళ్ల సంగతి పక్కన బెడితే అంతకుముందు నాలుగు రోజుల పాటు చలి, జ్వరం, దగ్గు, జలుబుతో తీవ్రంగా బాధపడినట్లు సదరు రోగి పేర్కొన్నాడు.

- జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతున్న ప్రజలు
- రోగులతో నిండిన ఆస్పత్రులు



కదిరి ప్రభుత్వాస్పత్రిలో ఓపీ కోసం బారులు తీరిన రోగులు



హిందూపురంలోని జిల్లా ఆస్పత్రిలో ఓపీ కౌంటర్ వద్ద రోగులు

సాక్షి, పుట్టపర్తి: వాతావరణంలో మార్పులతో చీకటి పడగానే విపరీతమైన చలితో జనాలు వణుకుతున్నారు. బయట తిరగలేని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు జలుబుతో బాధపడే వారు మరింత అస్వస్థతకు గురవుతున్నారు. ఆ తర్వాత దగ్గు.. అనంతరం జ్వరం బారిన పడుతున్నారు. చలి తీవ్రత కారణంగా ఆస్పత్రులకు బారులు తీరుతున్న రోగుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన వసతులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని రోగాలకు మందులు కూడా అందుబాటులో లేకపోవడంతో బయట మెడికల్ షాపుల్లో డబ్బు పెట్టి కొంటున్నారు. వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా సాయంత్రం 5 గంటలు కాగానే చలి ప్రభావం చూపుతోంది. ఉదయం 9 గంటల వరకూ ఎండ కానరాదు. పొగమంచు ప్రయాణాలు చేసిన వారు ఒక్కరోజులోనే జ్వరం బారిన పడుతున్నారు.

పడిశం పడితే వదలదు

చలి తీవ్రత కారణంగా జలుబు (పడిశం) సోకితే చాలు వెనువెంటనే దగ్గు, జ్వరం వస్తున్నాయి. ఒక్కసారి పడిశం పడితే కనీస వారం పది రోజులైనా వదలదన్నట్లు రోగులు చెబుతున్నారు. చిన్నపాటి రోగమైనా వారం రోజుల పాటు మనిషిని కదలనివ్వకుండా ఇంటికే పరిమితం చేస్తోంది. ఫలితంగా ఇంట్లో మిగిలిన వారికీ రోగాలు సోకుతున్నాయి. ఎన్ని రకాల మందులు వాడినా.. రోజూ ఆస్పత్రుల చుట్టూ తిరిగినా రోగాలు మాత్రం తగ్గడం లేదు. ప్రతి రోగి వారం రోజుల పాటు ఆస్పత్రుల చుట్టూ తిరగడమే కాకుండా నానా రకాల మందులు, మాత్రలు మింగలేక ఇబ్బంది పడుతున్నారు.

ఆస్పత్రులన్నీ కిటకిట

హిందూపురంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రి, ధర్మవరం, కదిరి, మడకశిరలోని ఏరియా ఆస్పత్రులు, మండల కేంద్రాల్లోని సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలతో పాటు అక్కడక్కడా వెలిసిన ప్రైవేటు ఆస్పత్రులు, ఆర్‌ఎంపీ క్లినిక్‌లు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో గంట సేపు నిరీక్షిస్తే గానీ.. టోకెన్ దొరకని పరిస్థితి నెలకొంది. దీనికితోడు ప్రభుత్వాస్పత్రుల్లో సరిపడా మందులు లేకపోవడంతో బయటికి రాసిస్తున్నారు. ఉచిత వైద్యం కోసం వెళ్తే రూ.వందల్లో ఖర్చు వస్తోందని రోగులు వాపోతున్నారు.

ప్రైవేటు బాదుడు

రోగాలను అదునుగా తీసుకున్న ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు పలు రకాల వైద్య పరీక్షల పేరుతో డబ్బులు దండుకుంటున్నారు. ఓసారి ప్రైవేటు ఆస్పత్రికెళ్లి చూపించుకుని బయటకు వచ్చే లోపు ఎంత తక్కువనుకున్నా రూ.2 వేలు దాటుతోందని పలువురు వాపోతున్నారు. బెడ్‌లు ఖాళీగా ఉంటే అవసరం ఉన్నా.. లేకున్నా.. సీరియస్ అంటూ అడ్మిట్ చేసుకుని రోజుకు సగటున రూ.3 వేలకు పైగా వసూలు చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముందు జాగ్రత్తలు తప్పనిసరి



రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించడం మంచిది. చలికాలంలో గోరు వెచ్చటి నీళ్లు తాగితే ఆరోగ్యానికి మంచిది. వ్యాధులు సంక్రమించే అవకాశం ఉండదు. కుటుంబంలో ఓ వ్యక్తి జబ్బు బారిన పడితే మిగిలిన సభ్యులకు కాస్త దూరంగా ఉండడం మంచిది. ముఖ్యంగా చిన్న పిల్లల దగ్గర అసలు ఉండకూడదు.

– డాక్టర్ మంజువాణి,
జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి

మరణం కాదు.. హత్య!

- మిస్టరీని ఛేదించిన ఆత్మకూరు పోలీసులు
- రిమాండ్‌కు నిందితులు

ఆత్మకూరు: ఓ సాధారణ మృతి కేసులో దాగి ఉన్న మిస్టరీని పోలీసులు ఛేదించారు. పోస్టు మార్టం నివేదిక ఆధారంగా హత్యగా నిర్ధారించుకున్న పోలీసులు ఆ దిశగా కేసు మార్చి దర్యాప్తు వేగవంతం చేశారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇటుకపల్లి సీఐ హేమంత్‌కుమార్, ఆత్మకూరు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపిన మేరకు...

11 నెలల క్రితం ఘటన

ఆత్మకూరు మండలంలోని ముట్టాల గ్రామానికి చెందిన మట్టి పెద్దరాజులు(36)కు భార్య శివమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. గొరిదిండ్ల సమీపంలోని హంద్రీ-నీవా కాలువ పక్కన తనకున్న పొలంలో గుడిసె వేసుకుని భార్యాపిల్లలతో నివసిస్తూ వ్యవసాయంతో పాటు వృషభాలకు రాతిదూలం లాగే శిక్షణ ఇస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరి 30న పొలం పనులు చేసిన అనంతరం రాత్రి భోజనం చేసి నిద్రించాడు. 31న ఉదయం ఎంత లేపినా నిద్ర లేవకపోవడంతో ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పెద్దరాజులు మృతి చెందినట్లు నిర్ధారించారు. అయితే అప్పట్లో పాము కాటుతోనో లేదా ఎద్దులు పొడవడం వల్లనో మృతి చెంది ఉంటాడని అందరూ భావించారు. ఆ దిశగానే భార్య శివమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నిజం బయటపెట్టిన పోస్టుమార్టం

పెద్దరాజులు మృతి అనంతరం శివమ్మ కావాలనే తన అత్తమామలతో ఘర్షణ పడి మదిగుబ్బలోని పుట్టింటికి చేరుకుంది. ఈ క్రమంలోనే పెద్దరాజులు మృతదేహానికి వైద్యులు నిర్వహించిన పోస్టుమార్టం నివేదిక పోలీసులకు అందించింది. ఆయనది సాధారణ మరణం కాదని, ఊపిరి అందకుండా చేసి హతమార్చినట్లుగా నిర్ధారణ కావడంతో హత్య కేసుగా పోలీసులు మార్చి దర్యాప్తు చేపట్టారు. దీంతో వాస్తవాలు ఒక్కొక్కటిగా వెలుగు చూశాయి. హతుడి తమ్ముడు అనిల్‌తో శివమ్మకు వివాహేతర సంబంధం ఉందనే విషయం తెలిసింది. ఇదే సమయంలో తమ చుట్టూ పోలీసుల ఉచ్చు బిగుస్తోందని తెలుసుకున్న అనిల్, శివమ్మ ఈ నెల 21న వీఆర్వో మహమ్మద్ రఫీ సమక్షంలో పోలీసులకు లొంగిపోయారు. అనంతరం హత్య చేసిన వైనాన్ని వివరించడంతో వారిని అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం రిమాండ్‌కు తరలించారు.

ఉత్తమ రైతుగా గద్దె రమణారెడ్డి



తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రమణారెడ్డి దంపతులు

రాప్తాడు: ద్రాక్ష సాగులో అత్యధిక దిగుబడి సాధించడమే కాక... తమ ప్రాంత రైతులకు అవగాహన కల్పించి, ద్రాక్ష సాగులో తోడ్పాటునందించిన రాప్తాడు మండలం హంపాపురం గ్రామానికి చెందిన రైతు గద్దె రమణారెడ్డిని ఉత్తమ రైతు పురస్కారంతో తెలంగాణ ప్రభుత్వం సత్కరించింది. వివరాలు... తనకున్న 5 ఎకరాల్లో రమణారెడ్డి గత ఏడాది దిల్‌ఖుష్ రకం ద్రాక్ష సాగు చేపట్టి గణనీయమైన దిగుబడిని సాధించాడు. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ వ్యవసాయాధికారులు అప్పట్లో రమణారెడ్డి తోటను సందర్శించి, ద్రాక్ష సాగు విధానాలను తెలుసుకున్నారు. అనంతరం దిగుబడులు వచ్చినప్పుడు మరోసారి క్షేత్ర సందర్శనకు వచ్చారు. అంతకు ముందు రైతు చెప్పినట్లుగానే ఎకరాకు 20 నుంచి 40 టన్నుల దిగుబడి సాధించడం, ఎకరాకు రూ.10 లక్షల దాకా ఆదాయాన్ని గడించడం తెలుసుకున్న అధికారులు ప్రత్యేక నివేదిక సిద్ధం చేసి తెలంగాణ ప్రభుత్వానికి అందజేశారు. దీంతో తెలంగాణలోనూ ద్రాక్ష సాగును అక్కడి ప్రభుత్వం ప్రోత్సహించింది. రైతు సూచనలు, సలహాలు పాటిస్తూ అక్కడి రైతులు అధిక పంట దిగుబడులు సాధించారు. దీంతో ఆదివారం నల్గొండ జిల్లా యాదాద్రిలో జరిగిన సమగ్ర వ్యవసాయ విజ్ఞాన సదస్సులో పుడమి పుత్ర పురస్కారాలను ప్రదానం చేశారు. ఆ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా రమణారెడ్డి, ఆయన సతీమణి పార్వతి పుడమి పుత్ర, కిసాన్ సేవా రత్న అవార్డును అందుకున్నారు.

ప్రశాంతంగా వదాన్య టాలెంట్ టెస్ట్



టాలెంట్ టెస్ట్‌కు హాజరైన విద్యార్థులు

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువులో ఆదివారం వదాన్య సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన వదాన్య టాలెంట్ టెస్ట్ -2024 ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 150 జెడ్పీ ఉన్నత పాఠశాల్లో 9,10 వతరగతి చదువుతున్న 3400 మంది విద్యార్థులకు హాల్‌టికెట్లు జారీ చేయగా 3150 మంది హాజరయ్యారు. మొత్తం ఏడు కేంద్రాల్లో పరీక్ష జరిగింది. డీఎస్పీ విజయకుమార్, సీఐ ఇందిర పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకున్న ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగానికి వదాన్య ఫౌండర్ అశోక్ పడపాటి కృతజ్ఞతలు తెలియజేశారు. జనవరి 10న ఫలితాలు విడుదల చేయనున్నట్లు తెలిపారు.

జూదరుల అరెస్ట్



పట్టుపడిన పేకాటరాయుళ్లను చూపుతున్న పోలీసులు

పుట్టపర్తి అర్బన్: మండలంలోని కర్ణాటక నాగేపల్లి కొండ ప్రాంతంలో పేకాట ఆడుతున్న 10 మందిని అరెస్ట్ చేసినట్లు పుట్టపర్తి రూరల్ సీఐ సురేష్, పుట్టపర్తి రూరల్, బుక్కపట్నం ఎస్‌ఐలు లింగన్న, కృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం ఉదయం డ్రోన్ కెమెరాతో పర్యవేక్షిస్తుండగా పేకాట స్థావరం బయటపడిందన్నారు. దీంతో జూదరులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.1,51,500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఉపాధ్యాయుడి బలవన్మరణం

కూడేరు: డి.హీరేహాళ్ మండలంలో పనిచేస్తున్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు భాస్కర్‌బాబు (57) ఆత్మహత్య చేసుకున్నారు. అనంతపురంలో నివాసముంటున్న ఆయనకు భార్య సునీత, ఇద్దరు కుమారులు ఉన్నారు. సునీత కూడా టీచర్‌గా పని చేస్తున్నారు. ఆదివారం ఉదయం కూడేరు మండలం బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న అగ్రిగోల్డ్ వెంచర్ సమీపంలో క్రిమి సంహారక మందు తాగి విషయాన్ని తన స్నేహితుడికి ఫోన్ చేసి తెలిపారు. ఆయన ద్వారా సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు ఆగమేఘాలపై అక్కడకు చేరుకుని భాస్కర్‌బాబును వెంటనే అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే తన భర్త ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులకు సునీత ఫిర్యాదు చేసింది. ఘటనపై కూడేరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఐదుకు చేరిన మృతుల సంఖ్య



సుజాత (ఫైల్)

గుడిబండ: మడకశిర మండలం బుళసముద్రం సమీపంలో శనివారం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీని టెంపో ట్రావెల్స్ ఢీకొన్న ఘటనలో మృతుల సంఖ్య ఐదుకు చేరుకుంది. ప్రమాదం జరిగిన రోజే నలుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. తీవ్రమైన గాయాలతో కర్ణాటకలోని తుమకూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుడిబండ మండలం కేఎస్‌పల్లికి చెందిన ఉపాధ్యాయురాలు సుజాత (48) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. ఆమె భర్త నాగేంద్ర జంబులబండ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఉన్నత చదువులు అభ్యసిస్తున్న ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలియగానే ఆమె పనిచేస్తున్న హిరేతుర్పి పాఠశాలలో విషాదఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న ఉపాధ్యాయులు, ఎంఈఓ రవిచంద్ర తదితరులు కేఎస్‌పల్లికి చేరుకుని సుజాత మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

అమడగూరు: మండలంలోని సంగీతంపల్లి శివారులో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటనారాయణ తెలిపారు. అందిన సమాచారం మేరకు ఆదివారం గ్రామ శివారులో తనిఖీలు చేపట్టామన్నారు. ఆ సమయంలో మహమ్మదాబాద్‌కు చెందిన రాజా... ద్విచక్ర వాహనంలో కర్ణాటక మద్యం తరలిస్తూ పోలీసులను చూసి వాహనాన్ని వదిలేసి పారిపోయాడన్నారు. వాహనాన్ని సీజ్ చేసి, 960 టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారీలో ఉన్న రాజాపై కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టనట్లు తెలిపారు.


అ'పూర్వ' సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

బత్తలపల్లి: మండలంలోని నల్లబోయనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2000–01లో పదో తరగతి చదువుకున్న 68 మంది విద్యార్థుల్లో 50 మంది అదే పాఠశాల వేదికగా ఆదివారం కలుసుకున్నారు. చదువుల అనంతరం వివిధ ప్రాంతాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడిన వీరందరూ కుటుంబ సభ్యులతో కలసి ఇటీవల స్వగ్రామానికి చేరుకున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పాఠశాలలో కలుసుకుని సందడి చేశారు. నాటి అల్లర్లను గుర్తు చేసుకుని మురిసిపోయారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన నాటి గురువులు ఈశ్వరమ్మ, లక్ష్మీనాయుడు, కేశవమూర్తి, రెడ్డిబాషాను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి అశోక్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, రాజా, శ్రీను, రాజశేఖర్, రామాంజి తదితరులు నేతృత్వం వహించారు.

నవోదయలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

లేపాక్షి: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో 1999 నుంచి 2006 వరకు చదువుకున్న 13వ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం అదే విద్యాలయ వేదికగా కలుసుకున్నారు. ఇందులో భాగంగా ఐదు జట్ల మధ్య క్రికెట్ టోర్నీ నిర్వహించి, విజేత ఉదయగిరి జట్టు క్రీడాకారులను అభినందించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. తమ వంతు సాయంగా రూ.10లక్షల వ్యయంతో మల్టీపర్పస్ హాల్ పైకప్పు పునరుద్ధరణ పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు చెప్పిన నాటి గురువులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రస్తుత విద్యార్థులు వేసిన పెయింటింగ్స్‌ను ప్రదర్శనకు ఉంచగా, వాటిని వేలం పాడి పూర్వ విద్యార్థులు కొనుగోలు చేశారు. ఈ మొత్తాన్ని విద్యాలయ నుంచి బయటకు వెళ్లి ప్రొఫెషనల్ కోర్సుల్లో చేరిన నిరుపేద విద్యార్థుల స్కాలర్‌షిప్‌లకు వెచ్చించాలని పూర్వ విద్యార్థులు కోరారు.


అమిత్‌షా రాజీనామా చేయాలి

- రఘువీరా డిమాండ్

మడకశిర: అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు ఆక్షేపణీయమని, ఈ వ్యాఖ్యలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడు ఎన్.రఘువీరారెడ్డి ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని పార్లమెంట్‌లో జరిగిన చర్చ సందర్భంగా కేంద్ర హోం మంత్రి అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని తెలిపారు. అంబేడ్కర్ రాజ్యాంగం ద్వారా దేశ ప్రజలకు సమాన హక్కులు కల్పించారని గుర్తు చేశారు. భారత ప్రజాస్వామ్య యుగంలో అంబేడ్కర్ కచ్చితంగా దేవుడేనని తెలిపారు.

ఆకట్టుకుంటున్న క్రిస్మస్ బొమ్మల కొలువు

గుంతకల్లు: క్రిస్మస్ సందర్భంగా గుంతకల్లులోని మస్తాన్‌పేట్‌లో నివాసముంటున్న రైల్వే విశ్రాంత ఉద్యోగి హృదయ్‌మోహన్ ఫెర్నాండేజ్, నిర్మలామేరి దంపతులు ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంటోంది. క్రీస్తు జన్మ వృత్తాంతాన్ని విశదీకరించేలా బొమ్మలను కొలువుదీర్చారు. ఇందు కోసం తన ఇంటి మిద్దెపై ఓ ప్రత్యేక షెడ్‌ను ఏర్పాటు చేశారు. ఏసు పుట్టిన సమయంలో తోక్క చుక్క ఆవిర్భవించడం మొదలు... గొర్రెల కాపరుల చుట్టూ పెద్ద వెలుగు రావడం, అప్పటి నజరేతు, బెత్లహామ్, జెరుసలేము, ఈజిప్టు వాసుల వేషధారణ, సంప్రదాయాలు కళ్లకు కట్టినట్టు చూపించారు. ఈ సందర్భంగా ఫెర్నాండేజ్ మాట్లాడుతూ... దాదాపు రెండు నెలల పాటు శ్రమించి బొమ్మలను సేకరించి కొలువు దీర్చినట్లు తెలిపారు. నెల రోజుల పాటు సందర్శకుల కోసం బొమ్మల కొలువును ఉంచుతున్నట్లు పేర్కొన్నారు.



క్రీస్తు జన్మ వృత్తాంతం తెలిపే బొమ్మలు




జెరుసలేములో చక్రవర్తుల భవనాల నమూనా



బొమ్మలకొలువు ఏర్పాటుకు సహకరించిన బంధువులతో ఫెర్నాండేజ్ దంపతులు



బెత్లహామ్ నగరంలోని ఇళ్లు, మనుషుల వేషధారణ, సంప్రదాయాలు తెలిపే బొమ్మలు



నజరేతు నగరంలోని భవనాలతోపాటు కొండగుట్టల ప్రాంతం